
సాక్షి
ఒడిశా
బుధవారం । 11 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,03,996లు, బంగారం 2.6 గ్రాములు, వెండి 140 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



యాత్రికుల బస్సులో మంటలు

- IIలో



ఆదర్శ రైల్వేస్టేషన్‌గా పర్లాకిమిడి

- IIలో

న్యూస్‌రీల్

జయపురం ఎస్‌డీపీఓగా హరీష్



ఎస్‌డీపీఓ హరీష్

జయపురం: సబ్ డివిజన్ పోలీసు అధికారిగా బి.హరీష్ మంగళవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో అరూప్ అభిషేక్ బెహరా ఇటీవల నువాపడా జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయను నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల అధికారులతో సమావేశమయ్యారు. శాంతి, భద్రతలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ప్రజలకు మరింత చేరువై, వారికి అండగా నిలవాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టడం తోపాటు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నేడు జగన్నాథునికి బొనొకొ లగ్గి

భువనేశ్వర్: శ్రీమందిరంలో బుధవారం బొనొకొ లగ్గిసేవ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రత్న వేదికపై మూల విరాట్‌లకు శ్రీముఖ అలంకరణ చేపడతారు. ద్వితీయ భోగ మండపసేవ అనంతరం సాయంత్రం 5 గంటలకు బొనొకొ లగ్గిసేవ ప్రారంభిస్తారు. రాత్రి 9 గంటల వరకు ఈ సేవ నిరవధికంగా కొనసాగుతుంది. ఈ వ్యవధిలో భక్తుల ప్రవేశం నివారించేందుకు సర్వదర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తారు. అలంకరణ అనంతరం సర్వదర్శనం యథాతథంగా లభిస్తుందని శ్రీమందిరం అధికార వర్గాలు తెలిపాయి.

కొరియాలో ఐటీడీఏ పీఓ పర్యటన



స్ట్రాబెరీ సాగును పరిశీలిస్తున్న పీఓ సోరేన్

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో ఐటీడీఏ పీఓ సారేన్ మంగళవారం పర్యటించారు. జిల్లాలోని పొట్టంగి సమితి కొఠియా పంచాయతీ పరిధి పట్టు చెన్నూరు, పగులు చెన్నూరు, జన్నిగూడ గ్రామాల్లో కలియ తిరిగారు. అక్కడి ప్రభుత్వ పాఠశాలల పనితీరు, స్ట్రాబెరీ సాగు, నిర్మాణ దశలో ప్రభుత్వ భవనాలు, గిరిజనుల కూరగాయల సాగు, నీటి నిల్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ శాఖల అధికారులను అక్కడిక్కడే పనుల వివరాలను అడిగారు. ఐటీడీఏ ద్వారా చేపట్టనున్న సరికొత్త పథకాల కోసం అధికారులు సిద్ధం చేసిన స్థలాలను పరిశీలించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో సంభాషించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

దేశ సమైక్యతకు అంతా ఏకమవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్ మహంతి

జయపురం: దేశ సమైక్యత, సమగ్రత, ధర్మ, రాజ్యాంగ పరిరక్షణకు భంగం కలిగిస్తున్న నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అంతా కలిసి పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్మిక నాయకుడు ప్రమోద్‌కుమార్ మహంతి పిలుపునిచ్చారు. బొయిపరిగుడ సమితి ముదులిగుడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశ సమగ్రతకు ఎన్నడూలేని ముప్పు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారిందని, ధరల పెరుగుదల ప్రజల నడ్డి విరుస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు పరం చేస్తూ దేశ ఆర్థిక మూలాలను విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని కోరారు. పార్టీ నాయకులు లయిచన్ ముదులి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వయోవృద్ధ కమ్యూనిస్టు నర్సింగ కమర అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో బొయిపరిగుడ సీపీఐ కార్యదర్శి గురు జానీ, లక్ష్మణ బొడొనాయక్, బలరాం నాయక్, ప్రభునంద ముదులి, బుద్ర బొడొనాయక్, నంద హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గేదేలే..



5 కిలోమీటర్ల నడక పోటీలకు సిద్ధమైన సీనియర్ సిటిజన్లు

- ఉత్సాహంగా కొనసాగుతున్న చొయితి క్రీడోత్సవాలు
- నడక పోటీల్లో సత్తాచాటిన వయో వృద్ధులు
- 5 కిలోమీటర్ల లక్ష్యాన్ని చేరుకొని, స్ఫూర్తిగా నిలిచిన మహిళలు
- అటానమస్ కళాశాలలో ముగిసిన అంతర కళాశాలల పోటీలు



జెడ్పీ చైర్‌పర్సన్ సరస్వతీ మాఝికి స్వాగతం పలుకుతున్న అధికారిని



నడక పోటీలో పాల్గొన్న మహిళలు

రాయగడ: చొయితి క్రీడోత్సవాల్లో భాగంగా మూడో రోజు జిల్లా యంత్రాంగం నిర్వహించిన సీనియర్ సిటిజన్ల నడక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 60 పదులు దాటిన వయస్సులోనూ తగ్గేదే లేదంటూ.. యువతరానికి స్ఫూర్తిగా నిలిచారు. ఇందులో 71మంది వయో వృద్ధులు పాల్గొన్నారు. పట్టణంలోని కొరాపుట్ కూడలి నుంచి ప్రారంభమైన ఈ పోటీలు సుమారు 5కిలోమీటర్ల దూరంలోని సిరికొన తరణి మందిరం వరకు కొనసాగాయి. ముందుగా జిల్లా అదనపు ఎస్పీ రాజ్‌ప్రసాద్ జెండా ఊపి పోటీలను ప్రారంభించగా.. నిర్ధారిత లక్ష్యానికి సీనియర్ సిటిజన్లు చేరుకున్నారు. అడుగడుగునా పోలీస్, చొయితి నిర్వాహక సిబ్బంది వారికి సహకరించారు. అవసరమైన వారికి తాగునీరు, గ్లూకోజ్ వంటివి అందించారు. అదేవిధం ఆరుగురు మహిళలు నడప్లో తమ లక్ష్యాన్ని చేరుకుని పోటీతత్వాన్ని చాటుకున్నారు.

రాయగడలో ఉత్సవ శోభ..

చొయితి ఉత్సవాల్లో భాగంగా గత మూడు రోజులుగా పట్టణంలో కొనసాగుతున్న చొయితి క్రీడోత్సవాలు పట్టణానికి మరింత శోభను చేకూర్చాయని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అన్నారు. మూడో రోజు క్రీడోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నా, పెద్ద అంతా కలిసి ఉత్సవాల్లో పాలుపంచుకోవడం ఆనందాన్నిస్తోందన్నారు. ఈ ఉత్సవాలు ఐక్యతకు అద్దం పడుతున్నాయని తెలిపారు. జిల్లా నుంచి వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి ఏటా ఉత్సవాలను తిలకించేందుకు రావడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. దీంతో పట్టణానికి మరింత శోభ చేకూరుతుందని ఆకాంక్షించారు.

విజేతలు వీరే..

సీనియర్ సిటిజన్ల నడక పోటీల్లో భాగంగా మహిళల్లో సుజాత మదల ప్రథమ స్థానంలో నిలవగా, సుజాత బారిక్ ద్వితీయ, కె.వసుంధర తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. అదేవిధంగా 50 నుంచి 60 వయో విభాగంలో మనోజ్‌కుమార్ ప్రధాన్ ప్రథమ స్థానం సాధించగా, రామచంద్ర మిషాల్, గుండిచి రౌత్ తరువాతి స్థానాలను కైవసం చేసుకున్నారు. అలాగే 60–70 వయస్సు కేటగిరిలో ఎస్.కృష్ణారావు, భరత్‌రామ ప్రధాన్, బి.దాలిరాజు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

జయాపజయాలతో పనిలేదు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

రాయగడ: ప్రతిభకు జయాపజయాలతో పని లేదని, ఓటమి గమ్యం కాదని జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ పేర్కొన్నారు. రాయగడ అటానమస్ కళాశాల ఆధ్వర్యంలో గత రెండు వారాలుగా అంతర కళాశాలల విద్యార్థుల మధ్య వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు కళాశాల మైదానంలో బహుమతుల ప్రధానోత్సవం చేపట్టగా, ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ప్రసంగించారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలుగులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తే తమ గమ్యాన్ని చేరుకోవచ్చని సూచించారు. రాష్ట్రం క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తోందని, త్వరలో హాకీ ప్రపంచకప్ పోటీలకు వేదికగా కావడం ఆనందకరమన్నారు.

జగన్నాథుని నిలయం ఒడిశా..

ప్రపంచ కీర్తిగాంచిన జగన్నాథునికి నిలయమైన ఒడిశాలో భిన్న సంస్కృతులు ఉన్నాయని జిల్లా అదనపు మేజిస్ట్రేటు సోమనాథ్ ప్రధాన్ అన్నారు. అన్ని సంస్కృతులను గౌరవించాలని, దీనిని గుర్తు చేసేందుకే ఏటా చొయితి తరహా ఉత్సవాలను అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 18న జరగనున్న చొయితి వేడుకలను అంతా కలసికట్టుగా విజయవంతమయ్యేలా సహకరించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే గంతాయిత్ మాట్లాడుతూ గత రెండు వారాలుగా అంతర కళాశాలల విద్యార్థుల మధ్య చిత్రలేఖనం, ముగ్గులు, వ్యాసరచన, వక్తృత్వ, పాటలు, సంగీతం, నృత్యం తదితర పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 120మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చనా పండా, సబ్ కలెక్టర్ భీమసేన్ సాబోరోత దితరులు పాల్గొన్నారు.

బీజేడీ పాలనలో కేంద్రం నిధులు పక్కదారి

- కేంద్ర చేనేత, రైల్వేశాఖ సహాయమంత్రి దర్శన్ జర్‌దోష్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి దర్శనా జర్దోష్



మాబుడి శాంతమ్మను దర్శించుకుంటున్న కేంద్రమంత్రి

బరంపురం: రాష్ట్రంలో అతి ముఖ్యమైన గంజాం జిల్లాలో 80శాతం మంది వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారని, వారి కోసం కేంద్రప్రభుత్వం కేటాయించిన వివిధ పథకాలను రాష్ట్రప్రభుత్వం నీరుగారుస్తోందని కేంద్ర చేనేత, రైల్వేశాఖ సహాయ మంత్రి దర్శనా విక్రమ్ జర్దోష్ ఆరోపించారు. జిల్లా పర్యటనలో భాగంగా బరంపురం రైల్వేస్టేషన్ రోడ్డులోని సర్క్యూట్ హౌస్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేడీ నిర్లక్ష్యం కారణంగా సీఎం నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో రైతుల ఆత్మహత్యలు సంఖ్య పెరిగాయన్నారు. నష్టపోయిన ఖరీఫ్ రైతులకు రుణ మాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. ఒడిశా అభివృద్ధిపై ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా దృష్టి సారించి, రూ.కోట్లాది నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అయితే ఒడిశా ప్రభుత్వం, బీజేడీ నాయకులు నిధులను తమ పేరుపై పథకాలుగా మర్చుతూ ప్రజలను ఏమార్చుతున్నారని మండిపడ్డారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శాంతమ్మ సేవలో..

దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్యదేవం, బరంపురం గ్రామదేవతగా పూజలందుకుంటున్న మాబుడి శాంతమ్మవారిని కేంద్రమంత్రి దర్శనా జర్దోష్ మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రమాదావశాత్తు పేలిన రివాల్వర్

- జవాన్‌కు గాయాలు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జవాన్ భాస్కర్ (ఇన్‌సెట్లో) జవాన్ పొట్టలో నుంచి బయటకు తీసిన తూటా

మల్కన్‌గిరి: ప్రమాదావశాత్తు రివాల్వర్ పేలి, జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ–79 పోలీసు స్టేషన్ పరిధిలో బీఎస్ఎఫ్ 142 బెటాలియన్‌కు చెందిన జవాను భాస్కర్ నారాయన్‌కు గాయాలయ్యాయి. భాస్కర్ శిబిరంలో తోట పని చేస్తుండగా, మరో జవాన్ తన తుపాకీ శుభ్రం చేస్తున్నారు. రివాల్వర్ ప్రమాదావశాత్తు పేలడంతో పొట్ట భాగంలో తూటా దూసుకుపోయింది. గమనించిన తోటి జవాన్లు ముందుగా కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతుండగా, ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తుకు ఆదేశించారు.

నేడే ప్రారంభ వేడుక

- హాకీ ప్రపంచ కప్‌కు టోర్నీ ప్రారంభోత్సవానికి కటక్‌లో భారీ ఏర్పాట్లు
- మధ్యాహ్నం వరకే పాఠశాలలు పరిమితం చేస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం



అగ్గి పుల్లలతో తయారు చేసిన ప్రపంచకప్

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు బుధవారం ఒంటిపూట సెలవు ప్రకటించారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత తరగతులు రద్దు చేయనున్నట్లు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం పురుషుల హాకీ ప్రపంచ కప్–2023 ప్రారంభ వేడుక పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకుంది. కటక్ బరాబటి స్టేడియంలో జరిగే ప్రారంభోత్సవం ప్రత్యక్ష ప్రసారం ఆద్యంతాలు బాలలు తిలకించేందుకు ఈ అవకాశం కల్పించారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకలో బాలీవుడ్, ఒలీవుడ్ ప్రముఖ కళాకారులు హాజరై, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో ఆకస్మిక ప్రమాదాల నిర్వహణ కోసం ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రి పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బరాబటి స్టేడియం ఆవరణలో అంబులెన్స్‌లు సిద్ధం చేస్తున్నారు. ప్రతి వాహనంలో ఇద్దరు చొప్పున సహాయకులు, ఒక్కొక్కరు అనస్తీషియా, ఫార్మసిస్ట్ ఉంటారు. ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో అత్యవసర చికిత్స కోసం ప్రత్యేక వైద్య బృందం సిద్ధంగా ఉంటుంది. ఈ బృందంలో కార్డియాలజిస్ట్, అనస్తీషియా, మెడిసిన్, సర్జన్, క్యాజువాలిటీ, ట్రామాకేర్ నిపుణులు ఉంటారు. అలాగే 10 పడకలను సిద్ధంగా చేశారు. కంటి విభాగం మూడో అంతస్తులో 50 జనరల్ బెడ్లను సిద్ధం చేశారు.

ట్రోఫీకి పటిష్ట భద్రత..

కటక్ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో పటిష్ట భద్రత వ్యవస్థ మధ్య హాకీ ప్రపంచకప్ ట్రోఫీని భద్రపరిచారు. బుధవారం ఉదయం ట్రోఫీతో నగర పర్యటన నిర్వహించనున్నారు. కేంబ్రిడ్జ్ స్కూల్, చండీ ఆలయం, శైలబాలా మహిళా కళాశాల, సమాజ్ ఆఫీస్, బక్సీ బజార్, నేతాజీ మ్యూజియం, కదమ్ రసూల్, చౌధురి బజార్, నయా సడక్, బాలూ బజార్, హైకోర్టు, రెవెన్షా యూనివర్సిటీ, కాలేజియేట్ స్కూల్, బెల్ వ్యూ ఛక్, సీడీఏ సెక్టార్–9, శిశుమందిర్, రోటరీ కంటి ఆస్పత్రి, మంగళా భాగ్, మాతామఠం మీదుగా కటక్ ఇన్ కటక్ ప్రాంతానికి ట్రోఫీ చేరుకుంటుంది. మధ్యాహ్నానికి బరాబటి స్టేడియానికి చేరుకునేలా అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు.

అగ్గి పుల్లలతో ప్రపంచకప్

భువనేశ్వర్: అగ్గిపుల్లలతో పురుషుల హాకీ ప్రపంచ కప్ ట్రోఫీ నమూనా రూపు దిద్దుకుంది. 2,726 అగ్గి పుల్లలతో 44 సెంటీమీటర్ల ఎత్తు, 18 సెంటీమీటర్ల వెడల్పుతో తయారైంది. పూరీ కుంభార్ పడాలో నివాసం ఉంటున్న 19 ఏళ్ల శాశ్వత రంజన్‌సాహు 13 రోజులు శ్రమించి దీనిని తయారు చేశాడు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- అధికారులకు ఎంపీ సప్తగిరి ఉల్క ఆదేశం



సమావేశంలో ఎంపీ సప్తగిరి, కలెక్టర్ అక్తర్, ఎమ్మెల్యేలు

కొరాపుట్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క ఆదేశించారు. కొరాపుట్ లోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన రోడ్డు భద్రత సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు స్పందించాల్సిన తీరుపై అవగాహన పెంచాలని సూచించారు. జిల్లాలో అత్యధిక భాగం ఘాట్ రోడ్లతో ఉందనే విషయాన్ని గుర్తించాలన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేటప్పుడు అవగాహన తరగతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. తరచూ వాహనాల తనిఖీ, డ్రైవింగ్ లైసెన్స్‌ల పరిశీలన స్థానంలో ఈ కార్యక్రమాలు నిరంతరం సాగాలన్నారు. రాత్రి సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా 2022 నవంబర్ 21న కొరాపుట్ సమీపంలో దురుగుడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని పోలీసులకు తెలియజేసిన శివప్రసాద్ దాస్‌ను అభినందిస్తూ రూ.2వేల రివార్డును అందజేశారు. ఇలా ప్రతి చోట రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వెనువెంటనే సమాచారం ఇచ్చి, ప్రాణాలు కాపాడిన వారికి రివార్డులు పెంచే అవగాహన కార్యక్రమం జరగాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినీపతి, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, పోలీసు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

గోపినాథ గజపతికి నివాళులు



సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: బరంపురం మాజీ ఎంపీ, గజపతి మహారాజా గోపినాథ గజపతి నారాయణదేవ్ మూడో సంస్మరణ సభ స్థానిక మహారాజా శ్మశాన వాటికలో మంగళవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ చంద్రశేఖర సాహు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, గజపతి వంశీయురాలు కల్యాణీదేవి ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

45 ఎకరాల్లో గంజాయి పంట ధ్వంసం



గంజాయి మొక్కలను తొలగిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కూర్మనూర్ పంచాయతీ డీబీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు మంగళవారం సయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో 44 ఎకరాల్లో సాగు చేస్తున్న 66వేల గంజాయి మొక్కలను గుర్తించారు. ఈ నేపథ్యంలో మొక్కలను తొలగించి, నిప్పంటించారు. చోళ్లు, పసుపు, కందులు తదితర పంటలు పండించి, ఆర్థికంగా బలోపేతం కావాలని, దీనికి ప్రభుత్వం తరపున కూడా సాయం అందిస్తామని గిరిజనులకు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

పైడితల్లికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో ఉన్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తీపి పదార్థాలను నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కిశోర్ కుమార్ పర్యవేక్షించారు.

మృతుని కుటుంబానికి రూ.5లక్షలు మంజూరు

బొబ్బిలి రూరల్: విద్యుత్‌షాక్‌తో 2019 అక్టోబర్ 15న మృతిచెందిన పక్కి గ్రామానికి చెందిన శంబంగి సీతంనాయుడు కుటుంబసభ్యులకు విద్యుత్‌శాఖ రూ.5లక్షల సహాయం మంజూరుచేసింది. ఈ మేరకు మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మంజూరు ఉత్తర్వు కాపీని మంగళవారం గ్రామంలో అందించారు. విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన సీతంనాయుడు కుటుంబాన్ని విద్యుత్‌శాఖ ఆదుకోవడంపై ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే డబ్బులు అందిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

8 వరికుప్పలు దగ్ధం

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో ఏడుగురు రైతులుకు చెందిన 8 వరికుప్పలు మంగళవారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపూడి అప్పలనాయుడు కళ్లంలో రైతులు మోపాడ అచ్చిబాబు, కెల్లగౌరి, సారిక త్రినాథ్, తాళ్లపూడి అప్పలనాయుడు, తాళ్లపూడి అప్పారావు, పాలూరి వెంకటఅప్పారావు, కలిశెట్టి సీతం నాయుడులకు చెందిన 8 వరికుప్పలు పెట్టగా పూర్తిగా ఆహుతయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా. సమాచారం మేరకు గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆదుపు చేశారు. అప్పటికే పూర్తిగా వరి కుప్పలు కాలిపోయాయి.

యువకుడిపై అట్రాసిటి కేసు

గంట్యాడ: నువ్వంటే ఇష్టం. నువ్వు లేకపోతే బతకలేనని సినిమా డైలాగులు చెప్పేసరికి ఆ యువతి నమ్మేసింది. తీరా పెళ్లి చేసుకోమని అడిగేసరికి ప్రేమికుడి అసలు రంగు బయట పడింది. దీంతో ఆ యువతి తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రేమికుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన ఓయువతిని ప్రేమిస్తున్నానంటూ నరవ గ్రామానికి చెందిన యువకుడు సుంకరి శేఖర్ 10 నెలలుగా నమ్మిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని ఆయువతి కోరడంతో నీవు ఎస్సీ కులస్తురాలవి కాబట్టి పెళ్లి చేసుకోలేనని ప్లేట్ ఫిరాయించాడు. దీంతో ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు శేఖర్‌పై అట్రాసిటి కేసు నమోదు చేసినట్టు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

నాటు తుపాకీ కలిగిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

బొబ్బిలి: నాటు తుపాకీతో సంచరిస్తున్న వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ మంగళవారం తీర్పునిచ్చారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మజ్జి జగన్నాథం విలేకరులకు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం చెక్కవలస కూడలిలో ఒడిశాలోని నారాయణ పట్నానికి చెందిన కొర్రా త్రినాథ 2015 ఏప్రిల్13న నాటు తుపాకీతో సంచరిస్తుండడంతో పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి వాసుదేవన్ నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.మూడు వేల జరిమానా విధించారని ఏపీపీ వివరించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నట్లు చెప్పారు.

దాడికేసులో ముద్దాయికి..

రాజాం సిటీ: రాజాం సబ్‌జడ్జి పరిధి పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో 2018లో నమోదైన దాడి కేసులో ముద్దాయికి .జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పాలకొండ మండలం అవలంగి గ్రామానికి చెందిన మజ్జి బంగారునాయుడిపై అదే గ్రామానికి చెందిన లోలుగు రాములునాయుడు కత్తితో దాడిచేసి గాయపర్చడంతో పాలకొండ స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదైంది. కేసు తుది విచారణ అనంతరం ముద్దాయి నేరం చేసినట్లు రుజువు కావడంతో సదరు వ్యక్తికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించారని పోలీసులు తెలిపారు. అయితే ముద్దాయికి 85 సంవత్సరాల వయస్సు కావడంతో పాటు వినికిడి, తదితర లోపాలు ఉన్నాయి. ఈ కారణంగా రూ.5వేలు వ్యక్తిగత బాండ్‌పై ఎగ్జిక్యూట్ చేస్తూ జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఆరు నెలల పరిశీలన అనంతరం పూర్తి నివేదిక సమర్పించాలని జడ్జి తీర్పునిచ్చినట్లు పోలీసులు వివరించారు.

యాత్రికుల బస్సులో మంటలు

- మధ్యప్రదేశ్ నుంచి సాక్షిగోపాల్ వచ్చిన యాత్రికుల బస్సులో షార్ట్ సర్క్యూట్
- సురక్షితంగా బయటపడిన 40మంది ప్రయాణికులు
- రాయగడలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి
- జయపురంలో కారు బోల్తాపడి ఇరువురికి గాయాలు



సాక్షిగోపాల్ ఆలయ పరిసరాల్లో మంటల్లో కాలిపోతున్న యాత్రికుల బస్సు

భువనేశ్వర్: మధ్యప్రదేశ్ నుంచి ఒడిశా చేరిన యాత్రికుల బస్సు మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. పూరీ జిల్లా సాక్షిగోపాల్ ఆలయం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదం సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో యాత్రికులందరూ ప్రాణాలతో బయటపడ్డారు. బస్సులో యాత్రికుల నగదు, లగేజీ, సెల్‌ఫోన్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. బస్సు బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం డిసెంబర్ 25న మధ్యప్రదేశ్ విండ్ జిల్లా, మొరెనా జిల్లాలకు చెందిన 120 మంది ప్రయాణికులు మూడు బస్సుల్లో యాత్రకు బయల్దేరారు. ఒక్కో బస్సులో 40 మంది చొప్పున ఉండగా, మంగళవారం తెల్లవారుజాము 5గంటలకు ప్రముఖ వైష్ణవ క్షేత్రం సాక్షిగోపాల్ ఆలయానికి చేరుకున్నారు. దేవాలయం సమీపంలోని సత్యబాది ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటు వద్ద రోడ్డుపై వాహనాన్ని నిలిపారు. కొందరు దైవదర్శనం కోసం ఆలయానికి వెళ్లగా.. మరికొందరు సమీపంలో వంట చేస్తున్నారు. అయితే అకస్మాతుగా మంటలు చేలరేగగా, ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బస్సులో 40మంది ప్రాయాణికులు సహా, నలుగురు సిబ్బంది ఉన్నారు.

సహాయక చర్యలు..

బాధిత యాత్రికులకు సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేందుకు పూరీ జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ప్రధానంగా ఆర్థిక సాయం అందజేసి తిరుగు ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. సత్యబాది మండల అభివృద్ధి అధికారి లోచన్ దాస్, తహసీల్దార్ జయంత్ జయసింఘ్ ప్రత్యక్షంగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. సాక్షిగోపాల్ పరిసర ప్రాంతాల స్వచ్ఛంద సేవా సంఘాలు సత్వర సాయం అందజేస్తున్నాయి. ఆచార్య హరిహర శిశుభవన్ బాధితులకు 50 కంబళ్లు పంపిణీ చేశారు. స్థానిక గోపాలపూర్ పట్నవాసులు ప్రీతిప్రజ్ఞ హోత్రా, శీతల్ హోత్రా యాత్రికులకు తాగునీరు, బిస్కట్లు, బట్టలు, స్వెట్టర్లు, టోపీలు, ఇతర సరుకులు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ సంస్థ సత్యబాది శాఖ గావంచాలు, టీ, అల్పాహారం, మందులు పంపిణీ చేశారు.

యువకుడి అనుమానాస్పద మృతి

రాయగడ: పట్టణంలోని రాణిగుడ ఫారం సమీపం కోళ్ల ఫారంలో ఓ యువకుని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు మట్టికోన పంచాయతీ పల్లిగుడ గ్రామానికి చెందిన రాజేష్ కద్రక(22)గా గుర్తించామని ఐఐసీ రస్మిరంజన్ ప్రధాన్ తెలిపారు. ఇంట్లో గొడవపడి రాయగడ వచ్చిన కద్రక.. ముందుగా తాను పనిచేస్తున్న కోళ్ల ఫారంలో బస చేశాడు. మంగళవారం తెల్లవారి తోటి స్నేహితులు తలుపు తట్టినా తీయకపోవడంతో తలుపులు విరగ్గొట్టి, లోపలికి వెళ్లారు. విద్యుత్ వైరుతో గదిపై ఉన్న కర్ర దుంగకు ఉరి వేసుకుని శవమై కనిపించాడు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. రాజేష్‌కు భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

రాయగడ: జిల్లాలోని శిఖాల్ పోలీస్ స్టేషన్ పరిధి పాత్రపూర్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పితామహల్ పంచాయతీలోని విష్ణుగుడ గ్రామానికి చెందిన రొంజు బిడ్డిక(25) కెరడ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి పడిపోయాడు. ప్రమాదంలో తలకు బలంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడని ఎస్‌డీపీఓ దేవజ్యోతి దాస్ తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

నదిలో కారు బోల్తా

జయపురం: సదర్ పోలీసు స్టేషన్ పరిధి అంబాగుడ గ్రామ సమీపంలోని కాలువలో కారు బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలాయ్యాయి. బాధితులను రమణగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. జయపురం బెల్‌రోడ్డుకు చెందిన పి.వెంకటేష్ కారులో స్నేహితుడు అరుణబాగ్‌తో కలిసి దొరగడలోని తన మిల్లు వద్దకు వెళ్తున్నాడు. అంబాగుడ సమీపంలో వాహనం అదుపు తప్పి కాలువలో బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. ఇరువురికీ తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



రాయగడ: మృతదేహం వద్ద విలపిస్తున్న స్నేహితులు



జయపురం: కాలువలో బోల్తాపడి ఉన్న కారు

ఆదర్శ రైల్వేస్టేషన్‌గా పర్లాకిమిడి



పర్లాకిమిడి రైల్వేస్టేషన్ నూతన నమూనా

- కేంద్ర రైల్వే, చేనేతశాఖ సహాయమంత్రి దర్శనా జర్దోష్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి దర్శనా జర్దోష్

పర్లాకిమిడి: స్థానిక పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని మౌలిక వసతులు కల్పించి, ఆదర్శ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతామని కేంద్ర రైల్వే, చేనేతశాఖ సహాయమంత్రి దర్శనా జర్దోష్ ప్రకటించారు. మంగళవారం గజపతి జిల్లాలో పర్యటించిన ఆమె.. స్థానిక రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్ ఆదేశాల మేరకు పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో మరో 6నెలల్లో పనులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్లాకిమిడి, గుణుపురం రైల్వేస్టేషన్ అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.3.85 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్లాట్‌ఫాం ఎత్తు పెంపు, ఇతర అభివృద్ధి పనులు చురుగ్గా సాగడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం గురండి, నారాయణపూర్ గ్రామాలను సందర్శించారు. అక్కడ గ్రామీణ మహిళలకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వలా గ్యాస్ పథకం, రైతులకు అందజేస్తున్న ఫసల్ బీమా యోజనా, రైతు బంధు డబ్బులు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా, ఈస్టుకోస్టు రైల్వే వాల్తేర్ డివిజనల్ మేనేజర్ అనూప్‌కుమార్ శత్పథి, పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి

పర్లాకిమిడి: కేంద్రప్రభుత్వం ప్రజల సంక్షేమార్థం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు చేరువయ్యేలా కార్యకర్తలు ప్రచారం చేయాలని కేంద్రమంత్రి దర్శనా జర్దోష్ కోరారు. పర్లాకిమిడికిలో పర్యటించిన ఆమెకు సర్క్యూట్ హౌస్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.నారాయణరావు, ఇతర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కలెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఆర్‌డీఏ అధికారులతో కేంద్రప్రభుత్వ పథకాలపై సమీక్ష జరిపారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో బీజేపీ మండల స్థాయి కార్యకర్తలతో సమావేశమై, మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని గజపతి, మోహానా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.నారాయణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భృగుబక్షి పాత్రో, జిల్లా పర్యవేక్షకులు సరోజ్ సాబత్, డాక్టర్ సుభాష్ సాహు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుల్లు మిశ్రా, జి.శ్రీధర్‌నాయుడు(గుసాని), జిల్లా సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, మహిళా మోర్చా నాయకురాలు అరుణిమా సాహు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత బిపిన్-6



కాంగ్రెస్‌లో చేరిన బీజేడీ నాయకులతో ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: స్థానిక సమితిలోని రాణిఘడ్‌లో నిర్వహించిన ఫ్రెండ్లీ సాత్‌భవునీ వాలీబాల్ టోర్నమెంట్‌లో బిపిన్-6 జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జితు-6 జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. చివరకు బిపిన్-6 జట్టును విజయం వరించింది. ఈ సందర్భంగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పాల్గొని, విజేతలకు ట్రోఫీ అందజేశారు. కొరాపుట్ జిల్లాలో క్రీడా ప్రగతి యువకులపైనే ఆధారపడి ఉందని తెలిపారు. క్రీడారంగంలో కొరాపుట్ జిల్లాను అగ్రస్థానంలో నిలపాలంటే యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమలో జయపురం సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు బసంతకుమార్ నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ లోకి బీజేడీ శ్రేణులు

బహుమతుల ప్రదానోత్సవంలో భాగంగా రాణిఘడ్‌లో పర్యటించిన ఎమ్మెల్యే బాహిణీపతికి గ్రామ ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు బీజేడీ నాయకులు తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ చేరారు. వారికి పూలమాలలు వేసిన బాహిణీపతి, సాదరంగా ఆహ్వానించారు. వీరిలో మాజీ సర్పంచ్ చంద్ర ప్రధాన్, రబి పెంటియా, భగు హరిజన్, జాదు పెంటియ, గోవర్ధన నాయక్, మోహన బాలపుటియ, భాస్కర నాయక్, బిద్యా నాయక్, భాస్కర పాయక్, ఉద్ధవపాట్, ధనుర్జన గౌడ ఉన్నారు.

ఫుట్‌బాల్ విజేత కొప్పెన



ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యేతో ఇరు జట్ల క్రీడాకారులు

కొరాపుట్: జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో కొప్పెన జట్టు విజేతగా నిలిచింది. నవరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్‌లో మంగళవారం జరిగిన పోటీల ఫైనల్ మ్యాచ్‌లో కొప్పెన జట్టు బెహడా జట్టును ఓడించింది. హాకీ ప్రపంచకప్ పోటీలకు మద్దతుగా జిల్లా అధికార యంత్రాంగం ఈ పోటీలను నిర్వహించింది. మొత్తం 24 జట్లు తలపడ్డాయని తెలిపారు. ముగింపు పోటీలకు స్థానిక ఎమ్మెల్యే నిత్యానంద గోండొ హాజరయ్యారు. ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకొని, స్నేహపూర్వకంగా కొనసాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మర్‌కొట్ బీడీఓ హిమాంచల్ మాఝి, సమితి చైర్‌పర్సన్ సుశీల మాఝి, జిల్లా పరిషత్ సభ్యుడు చందన్‌రాయ్, క్రీడాకారులు దుర్గాప్రసాద్ మాలిక్, కృష్ణప్రసాద్ పట్నాయక్, చందన్‌మాలి తదితరులు పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ: పలువురికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న స్థానికులు

కురుపాం/గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని గుమ్మగదబవలస గ్రామ సమీప మలుపు వద్ద మంగళవారం ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్న సంఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై కురుపాం ఎస్సై సీహెచ్.ప్రసాద్ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. వంజరాపుగూ డ నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్న ఆటో, గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వస్తున్న వ్యాయామ ఉపాధ్యాయలు బి.వైకుంఠరావు, పత్తిక చంద్రమోహన్, నిమ్మక మాధవరావు, పత్తిక విజయవర్థన్‌ల కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి, దీంతో ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న చీమల చిరంజీవి కాలు నుజ్జునుజ్జు కాగా, వంజరాపు నాని, వెంకటరమణ, ఆటో డ్రైవర్ పల్ల ఆదర్శ్ గాయాల పాలయ్యారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి క్షతగాత్రులను పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్, స్కూటీ ఢీకొని మరో వ్యక్తి..

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామానికి చెందిన కోరాడ సింహచలం గ్రామం నుంచి అలమండ సంతకు సైకిల్‌పై వెళ్తున్న సమయంలో కొత్తవలస నుంచి అలమండ సంతవైపు స్కూటీపై వస్తున్న వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయాల పాలైన అతనిని 108 వాహనం ద్వారా విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



గోర్జ తిరుపతమ్మ మృతదేహం




సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మడక సత్యవతి

ఉసురు తీసిన ఉపాధి యంత్రం



పోల లక్ష్మమ్మ మృతదేహం



గాయపడిన గేదెల శ్రీదేవి

- వరినూర్పిడి యంత్ర వాహనం బోల్తా పడి..
- ఇద్దరు మహిళాకూలీల మృతి
- మరో ఇద్దరికి గాయాలు

బొబ్బిలి రూరల్: కూలి ఆడితే గానీ కుండాడని మహిళా కూలీలు పనికోసం వెళ్తూ తిరిగిరాని లోకాలకు పయనమయ్యారు. ఉపాధి కల్పించే యంత్ర వాహనమే వారి పాలిట మృత్యు శకటమైంది. పని కోసం వెళ్లిన తమ వారు తిరిగి సాయంత్రం ఇంటికి వస్తారని ఎదురు చూస్తున్న కుటుంబసభ్యులకు వారి మరణ వార్త అందడంతో కంటికీ మింటికీ ఏకధారగా రోదించారు. ప్రతిరోజూ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకునే వ్యవసాయ మహిళా కూలీలు ఇద్దరు వరి నూర్పిడి యంత్రంపై పడి మంగళవారం ప్రాణాలు కోల్పోయారు. మండలంలోని గొంగాడవలస పంచాయతీ పరిధి అన్నంనాయుడు వలసలో ఇద్దరు మహిళా కూలీలు మృతిచెందడంతో వారి కుటుంబాలతో పాటు గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఈ సంఘటనపై ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నంనాయుడు వలస గ్రామానికి చెందిన గోర్జ తిరుపతమ్మ (50), పోల లక్ష్మమ్మ(48), మడక సత్యవతి, గేదెల శ్రీదేవిలు రోజూలాగానే వ్యవసాయపనుల కోసం తమ గ్రామానికే చెందిన చొక్కాపు చంద్ర వరినూర్పిడి యంత్రం వాహనంపై కూర్చుని బయల్దేరారు. గ్రామానికి కొంతదూరంలో గల పొలంలోకి వెళ్తున్న వాహనం ఓ పుట్టను తప్పించబోయి బోల్తాపడింది. వాహనంపై కూర్చుని ప్రయాణిస్తున్న గోర్జ తిరుపతమ్మ యంత్రంపై పడి అక్కడికక్కడే మృతిచెందగా, పోల లక్ష్మమ్మ కొనఊపిరితో కొట్టుమిట్టాడి అరగంట అనంతరం మృతిచెందింది. మృతురాలు గోర్జ తిరుపతమ్మకు ఇద్దరుకుమార్తెలు చంద్రకళ, చిన్నతల్లి, కుమారుడు రవికుమార్ ఉన్నారు. 2022 మేనెలలో ఆమె భర్త అన్నంనాయుడు మృతిచెందాడు. పోలలక్ష్మమ్మకు భర్త శ్రీరాములు, కుమారుడు జనార్దనరావు, కుమార్తె భవాని ఉన్నారు.

విశాఖ కేజీహెచ్‌కు క్షతగాత్రుల తరలింపు

వాహనంపైనే ఉన్న మరో ఇద్దరు మడక సత్యవతి, గేదెల శ్రీదేవిలు తీవ్రంగా గాయపడడంతో వారిని 108అంబులెన్స్‌లో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం మేరకు బొబ్బిలి సీఐ ఎం. నాగేశ్వరరావు ఘటనాస్థలిని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై చదలవాడ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతగా 'శంబరం' నిర్వహిద్దాం

- ఆర్డీవో హేమలత, డీఎస్పీ సుభాష్



జాతరపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో హేమలత

మక్కువ: విజయనగరం అంటే గుర్తుకువచ్చేది పైడితల్లి అమ్మవారి పండగ. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా అంటే శంబరపోలమాంబ అమ్మవారి పండగ అని గుర్తుకు వచ్చేలా మనమంతా బాధ్యత తీసుకుని అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించుకుందామని ఆర్డీవో హేమలత కోరారు. ఈ మేరకు మండలంలోని శంబర గ్రామంలో చదురుగుడి వెనుకన క్యూ ప్రదేశం వద్ద జాతర నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో హేమలత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, పోలీస్‌శాఖ, దేవాదాయశాఖ, వైద్యశాఖ తదితర శాఖల అధికారులు జాతరలో ఏర్పాట్లు చేయాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సమావేశంలో సాలూరు సీఐ ధనుంజయ రావు మాట్లాడుతూ జాతరలో బందోబస్తు నిర్వహించనున్న అధికారులు, సిబ్బందికి వసతి సౌకర్యాన్ని దేవాదాయ, పంచాయతీశాఖల అధికారులు కల్పించాలన్నారు. అలాగే జాతరలో ఏయే శాఖల అధికారులు విధులు నిర్వహించనున్నారో వారి వివరాలు పోలీస్ శాఖకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హేమలతను కోరారు. జాతరలో ఏదైనా సమస్య వస్తే, వెంటనే ఆయాశాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, సమస్య పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

జాతరలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆర్డీవో హేమలత మాట్లాడుతూ బుధవారం ఉదయం 10గంటల కల్లా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వివరాలను ఆయాశాఖల అధికారులు అందించాలని ఆదేశించారు. జాతరలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్కింగ్ స్థలాలను గుర్తించి, వెంటనే వివరాలు అందించాలని సూచించారు. అలాగే దర్శనం టికెట్లు, ప్రసాదం కౌంటర్ ప్రదేశాల వివరాలు అందించాలని ఈవో రాధాకృష్ణను కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారులు భక్తులు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. 104,108 వాహనాలతో పాటు, ఏఎల్‌ఓ స్ప్రే అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓకు సూచించారు.

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి

శంబర, చెముడు గ్రామాల మధ్యనున్న గోముఖి నదిపై నుంచి వేలాదిమంది భక్తులు రాకపోకలు సాగించనున్నందున, ఆప్రదేశంలో విద్యుత్ లైట్లు ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి సుధారాణి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, సర్పంచ్ సింహాచలమమ్మ, ఎంపీడీవో దేవకుమార్, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, కమిటీసభ్యులు, ఎస్సై జి.పైడిరాజు, దేవాదాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గెడ్డలో వృద్ధుడి మృతదేహం

పోలాకి: మండలంలోని కొల్లివలస వద్ద వంశధార కాలువ(పోలాకి గెడ్డ)లో మంగళవారం ఉదయం వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగు రోజులుగా కనిపించకుండాపోయిన రాళ్లపాడుకు చెందిన పల్లి లచ్చయ్యగా గుర్తించారు. లచ్చయ్యకు మతిస్థిమితం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఎస్‌ఐ నర్సింహమూర్తి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

బాలికల వసతి గృహం తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మరుగుదొడ్ల పరిశుభ్రం చేయడానికి విద్యార్థుల నుంచి వార్డెన్ డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలు విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయడంతో నిజ నిర్ధారణ కోసం సబ్ కలెక్టర్ విచారణ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ అక్కడి పరిస్థితులు తెలుసుకున్నారు.

గద్దర్‌కు ఘన స్వాగతం

పలాస: సిక్కోలు జానపద కళావేదిక ఆధ్వర్యంలో పలాస మండలం చిన్న నీలావతి గ్రామంలో బుధవారం జరగనున్న జానపద కళాజాతరలో పాల్గొనేందుకు ప్రజా గాయకుడు, యుద్ధనౌక గద్దర్ మంగళవారం పలాస చేరుకున్నారు. జానపద , సినీ నటుడు డాక్టర్ కుమార్‌నాయక్, ఉద్దాన ప్రాంత జానపద కళాకారులు రాపాక ధనరాజు, మల్లేన దేవరాజు, కుత్తుం వినోద్, మామిడి కృష్ణారావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని, కళాభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

హోంగార్డుకు చేయూత



అప్పారావుకు చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు తోటిహోంగార్డులు తమ ఒక్కరోజు గౌరవ వేతనాన్ని ఆర్థిక సాయంగా అందించారు. శ్రీకాకుళం యూనిట్‌లో హోంగార్డుగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఎస్.అప్పారావుకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రూ.4.32 లక్షల చెక్కును ఎస్పీ జి.ఆర్.రాధిక చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ నుంచి ఎటువంటి సహాయం కావాలన్నా అండగా ఉంటామని, ఆరోగ్యం కాపాడుకోవాలని భరోసా అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ డి.ప్రసాదరావు, ఆర్‌ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సీఐటీయూ మహాసభలు



పతాకావిష్కరణలో యూనియన్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలు విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.వి.రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం అరిణాం అక్కివలసలోని శ్యాంక్రగ్ పిస్టన్ పరిశ్రమ ఆవరణలో సీఐటీయూ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలుస్తోందని దుయ్యబట్టారు. లేబర్ చట్టాలు పక్కాగా అమలు కావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



హనుమంతు లజపతిరాయ్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది మూడు రాజధానులను కాదని, మూడు ప్రాంతాల అభివృద్ధిని అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్సలర్, రాష్ట్ర వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతి రాయ్ అన్నారు. ఎచ్చెర్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 2014లో అప్పటి ప్రభుత్వ ప్రకటించిన అమరావతి అభివృద్ధి చెందాలంటే రాష్ట్రం మొత్తం ఆదాయం 30 ఏళ్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. అప్పుడు అభివృద్ధి నిలిచిపోయి చిన్న రాష్ట్రాల ఉద్యమాలు పుట్టుకొస్తాయని చెప్పారు. రాజధాని ప్రగతి కోసం మిగతా ప్రాంతాల అభివృద్ధిని అడ్డుకోవటం సరికాదన్నారు. విశాఖపట్నానికి పాలనా రాజధానిగా అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు.

• వలకు చిక్కిన కొండచిలువ



ఎల్.ఎన్.పేట మండలం కొమ్ముపలస సమీపంలో అప్పలనాయుడు చెరువులో మంగళవారం కోరాడ వెంకటరావు అనే వ్యక్తి చేపల వేట సాగిస్తున్న సమయంలో వలకు భారీ కొండచిలువ చిక్కింది. ముందు బరువుగా ఉండటంతో పెద్ద చేపలు చిక్కాయని సంతోషపడ్డానని, తీరా ఒడ్డుకు తీసుకొచ్చి చూడగా కొండ చిలువ ఉండటంతో సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో విడిచిపెట్టామని వెంకటరావు తెలిపారు.

- ఎల్.ఎన్.పేట

•పండగొచ్చిన వేళ..



సంక్రాంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. హరిదాసులు ఇంటింటా తిరుగుతూ హరినామ సంకీర్తనలు వినిపిస్తున్నారు. ధనుర్మాసం నెలరోజులూ శ్రీమహావిష్ణువులా అక్షయ పాత్రను తలపై ధరించి, ఓ చేతిలో చిడతలు, మరో చేతిలో తంబూరతో ఊరూర తిరుగుతూ సంప్రదాయాల పరిరక్షణకు పాటుపడుతున్నారు హరిదాసులు. మంగళవారం సన్యాసిపుట్టుగకు చెందిన హరిదాసు పలు సంకీర్తనలు వినిపించారు.

- ఇచ్ఛాపురం రూరల్

•'కొంగొ'త్త అందాలు



వరి కోతలు దాదాపు పూర్తయ్యాయి. వరి నూర్పులు అవుతున్న తరుణంలో కుప్పలు కల్లాలకు చేర్చుతున్న సమయాన పొలాల్లో వరి ఓవులు పైన కొంగలు ఆహారం కోసం గుంపులు గుంపులుగా చేరి మిడతలను తింటున్నాయి. భారీగా చేరిన కొంగలతో పొలాలు ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి.

- జలుమూరు

నిజాయితీగా పనిచేస్తుంటే ఆరోపణలా?

● మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిజాయితీగా పని చేస్తున్నా తనపై ఆరోపణలు చేస్తున్నారని, ఈనాడు పేపర్‌లాంటిది తనకూ ఉంటే తానూ రాయగలనని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. శ్రీకాకుళం నగరంలోని ఎల్బీఎస్ కాలనీ, పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో రహదారులను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. అభివృద్ధి జరగడం లేదంటున్న ప్రతిపక్షాలు ఒక్కసారి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. తాను భూములు కొల్లగొట్టానని ఈనాడు పత్రిక పదేపదే రాస్తోందని, నిజానికి తనకు భూములు కేటాయించే హక్కు గానీ అధికారం గానీ లేవని, ఏదైనా కేటాయింపులు చేయాలంటే అది క్యాబినెట్ నిర్ణయానుసారం జరుగుతుందని స్పష్టం చేశారు. రాజధాని విషయమై ఇప్పటికే స్పష్టత ఇచ్చామన్నారు. అమరావతి కేంద్రంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటామంటే తామెలా ఒప్పుకుంటామని ప్రశ్నించారు. ఇన్నేళ్ల తరువాత విశాఖ కేంద్రంగా రాజధాని ఏర్పాటుకు అవకాశం దక్కిందని, దీనికి మద్దతుగా మాట్లాడుతున్నందున భూములు కొట్టేశానని అర్థరహిత అభియోగాలు చేస్తున్నారని మండిపడ్డారు. అయినా ఇక్కడి ప్రాంత ప్రయోజనాల కోసం గొంతెత్తక మానలేనని పునరుద్ఘాటించారు. అమరావతి నుంచి అరసవల్లి వరకూ రాజధాని రైతుల పాదయాత్రకు వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు ఈనాడు, ఆంధ్రజ్యోతికి విలన్‌గా కనిపించానని, అమరావతికి జై కొడితే వాళ్లకు గొప్పవాడిలా కనిపిస్తానని మంత్రి పేర్కొన్నారు. మీరు అమరావతి కేంద్రంగా రాజధాని పెట్టుకుంటామంటే మా రాష్ట్రం విశాఖ కేంద్రంగా మాకు ఇవ్వాలి అని డిమాండ్ చేశానని గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోతే నష్టపోయినందుకు పరిహారంగా 23 సంస్థలను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో ఒక్కటి కూడా జిల్లాలో నెలకొల్పలేదన్నారు. అప్పట్లో ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చంద్రబాబు తన ఎదుటకు వస్తే ఆయన ఎన్ని అక్రమాలకు పాల్పడ్డారో రుజువు చేస్తానని ప్రకటించారు.

40 ఏళ్ల తర్వాత..



వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982–83 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటూరు సముద్ర తీరంలో మంగళవారం మళ్లీ కలిశారు. సహపంక్తి భోజనాలు చేసి స్కూలు జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

-వజ్రపుకొత్తూరు రూరల్

'చిత్తడి నేలను పరిరక్షించాలి'



బీల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం

సోంపేట: సోంపేట మండలంలోని బీల ప్రాంతంలో ఉన్న విశిష్టమైన చిత్తడి నేలలను కాపాడాలని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి, సంఘ ప్రతినిధులు గ్రీన్ ట్రిబ్యునల్ కమిటీ సభ్యులను కోరారు. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్‌లో సోంపేట బీల ప్రాంతాన్ని చిత్తడి నేలలుగా గుర్తించాలని సోంపేట పర్యావరణ పరిరక్షణ సమితికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ జాయింట్ కార్యదర్శి సుజిత్ బాజ్‌పేయి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రీన్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం బీల ప్రాంతంలో మంగళవారం పర్యటించింది. బృంద సభ్యులు మండలంలోని పలాసపురం, రామయ్యపట్నం, గొల్లగండి గ్రామాల్లోని చిత్తడి నేలలు పరిశీలించి, వాస్తవిక పరిస్థితులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతులు స్వీకరించారు. పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి బీల ప్రాంత విశిష్టతను చిత్రపటం ద్వారా వివరించారు. ఇక్కడ జరిగిన పోరాటాల గురించి వారికి చెప్పారు. రైతులు సనపల శ్రీరామమూర్తి, బార్ల సుందరరావు తదితరులు మాట్లాడుతూ రైతులకు కలుగుతున్న ప్రయోజనాలు, ఇక్కడి జీవ వైవిధ్యం గురించి తెలిపారు. బృందసభ్యులు సుజిత్ బాజ్‌పేయ్ మాట్లాడుతూ వాస్తవిక పరిస్థితులు గుర్తించామని, ఇవి చిత్తడి నేలలేనని తెలిపారు. నివేదికను కోర్టుకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌ఎస్ ప్రత్యేక కార్యదర్శి చలపతిరావు, ఎంఓఈఎఫ్‌సీసీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ రట్టి, శాఖాస్‌కు చెందిన శాస్త్రవేత్త రాజ్ జయపాల్, సౌమ్య, జేసీ ఎం.నీవన్, ఆర్డీఓ టి.సీతారామమూర్తి, తహసీల్దార్ ఎస్.రమేష్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



శివకుమార్(ఫైల్)

సరుబుజ్జిలి: కొత్తకోట గ్రామానికి చెందిన డోల శివకుమార్ రెండు రోజులుగా కనిపించడం లేదని తల్లి డోల సత్యవతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో కూరగాయల షాపు నిర్వహించే శివకుమార్ ఎప్పటిలాగే ఈ నెల 9న ఉదయం 9 గంటల ప్రాంతంలో కూరగాయల కొనుగోలుకు బయటకు వెళ్లారు. పండగ దుస్తుల కొనుగోలుకు సిద్ధంగా ఉండమని మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. సాయంత్రం గడచినా ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో పరిసరాలు ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించారు. అయినా ఫలితం రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. శివకుమార్‌కు వివాహం కాగా, ఓ కుమార్తె ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 8790832825 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

యువశక్తి సభావేదికను పరిశీలించిన ఎస్పీ



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

లావేరు: మండలంలోని తాళ్లవలస వద్ద ఈ నెల 12న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జరగనున్న యువశక్తి సభాస్థలిని ఎస్పీ జి.ఆర్.రాధిక మంగళవారం పరిశీలించారు. సభావేదిక, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీ మహేంద్ర పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఏటీఎం చోరులు?

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో పలుచోట్ల బ్యాంకు ఏటీఎం కేంద్రాలను సాంకేతికంగా మిస్ యూజ్ చేసి రూ.65 లక్షలు దోచుకెళ్లిన ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌ను శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. శ్రీకాకుళం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి ఏటీఎంలో గత సంవత్సరం జూలై నుంచి నవంబరు వరకు సొమ్ము మాయమవుతున్నట్లు మేనేజర్ గుర్తించి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పలుచోట్ల జరిగి సుమారు రూ.65 లక్షల మేర నగదు మాయమైంది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌కు చెందిన నలుగురు చోరులు వారి గ్యాంగ్‌తో కలిసి ఏటీఎం కేంద్రాల్లో ఈ మోసాలకు పాల్పడినట్లు తెలిసింది.

డయల్ యువర్ జేసీకి 30 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో మంగళవారంపౌర సరఫరాల సంస్థ మేనేజర్ పి.జయంతి, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ ఆధ్వర్యంలో డయల్ యువర్ జేసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను ఫోన్ ద్వారా వివరించారు. ధాన్యం కొనుగోలులో తలెత్తిన ఇబ్బందులను వివరించగా, పరిష్కారానికి అధికారులు సూచనలు అందించారు.

జెడ్పీ అంచనా బడ్జెట్ రూ.1877 కోట్లు



బడ్జెట్ ఆమోదంపై మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ, ప్రక్కనే సిఈవో వెంకట్రామన్

● 2023–24 సంవత్సరానికి గాను సభ్యుల ఆమోద తీర్మానం

● జెడ్పీ ఆదాయంపై దృష్టి పెట్టాలన్న ఛైర్‌పర్సన్ పిరియా విజయ

అరసవల్లి: జిల్లా పరిషత్ ఆదాయ, వ్యయాల ఆధారంగా 2022–23 సవరణ బడ్జెట్, 2023–24 అంచనా బడ్జెట్ ప్రతిపాదనలకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. జెడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ సమక్షంలో అధికారులు జిల్లా పరిషత్ బడ్జెట్ ప్రతిని సమావేశంలో చదివి వినిపించారు. 2022–23 సవరణ బడ్జెట్ ఆదాయం రూ.1757,90,78,896 కాగా, వ్యయం రూ. 1611,58,61,942 గానూ మిగులు రూ.146,32,16,954గా పేర్కొన్నారు. 2023–24 గాను అంచనా బడ్జెట్‌గా ఆదాయం రూ.1877,04,59,662 కాగా, వ్యయం రూ.1744,76,41,027, మిగులుగా రూ.132,28,18,635గా చూపించి ప్రతిపాదించారు. అంచనా బడ్జెట్‌లపై ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో సుమారు 20 మంది జెడ్పీటీసీలు ఆమోదం తెలియజేశారు. దీంతో 2023–24 అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ తదితర ఐదు విభాగాలతో పాటు జిల్లా పరిషత్‌కు వస్తున్న ఆదాయ, వ్యయాలను అంచనాలు వేసి బడ్జెట్‌ను రూపొందించినట్లు సీఈఓ తెలిపారు. కేవలం జెడ్పీకి సీనరేజీ ఫీజు, సర్‌చార్జీ ఆన్ స్టాంప్ డ్యూటీ, రూ.4 చొప్పున తలసరి ఆదాయంతో పాటు అద్దెలు–ఇతరత్రా మార్గాల ద్వారా సకాలంలో జెడ్పీకి ఆదాయం వచ్చేలా కృషి చేయాలని ఛైర్‌పర్సన్ సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ పాలిన శ్రావణి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు 1వ జెడ్పీ స్థాయి సంఘ సమావేశం కూడా ఛైర్‌పర్సన్ అధ్యక్షతన ముగిసింది.

'ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న కేంద్రం'



చిలకమ్మ స్థూపం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మందస: ఆదివాసీల ఆశాజ్యోతి సవర చిలకమ్మ అలియాస్ మంత్రిబుడి అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మందస మండలం కొండలోగాంలో మంగళవారం చిలకమ్మ 28వ వర్థంతి నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరక్ష్యరాస్య గిరిజన కుటుంబంలో జన్మించిన మంత్రిబుడి గిరిజనుల్లో చైతన్యం తీసుకువచ్చిందన్నారు. ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి అమరురాలైనట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం ఆదివాసీ హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని, 1/7చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాలు పోడుభూములు అందినప్పుడే చిలకమ్మకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థూపం వద్ద సవర దాశరథి పతాకావిష్కరణ చేయగా, ప్రజా సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, జగన్, వినోద్, కూర్మారావు, రామారావు, సోమేశ్, హేమావతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజను కొంటాం

● మిల్లర్లతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో తలెత్తుతున్న సమస్యలను జిల్లా రైస్‌మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రైతులు, మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సమక్షంలో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ మంత్రి కనుమూరి వెంకట నాగేశ్వర రావు, అధికారులతో ధర్మాన ఫోన్‌లో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ధర్మాన మాట్లాడుతూ రైతులు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 4.3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంతో పాటు అదనంగా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆదేశాలు వచ్చాయని ప్రకటించారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



మాట్లాడుతున్న మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన మొత్తం ధాన్యం, ముందుగా నిర్దేశించిన లక్ష్యాలకు మించి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోషియేషన్ కార్యదర్శి, జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు రెడ్డి విజయశ్రీ వెంకటేశ్వరరావు (వాసు) అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 9.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాలు వేశారని, ప్రభుత్వం మాత్రం 4.5 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు లక్ష్యంగా తీసుకుందని చెప్పారు. మిగిలిన ధాన్యం కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సహకరించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావును కలవగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. మంత్రి నాగేశ్వరరావుతో పాటు సివిల్ సప్లయ్ కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండియన్‌లతో మాట్లాడి జిల్లాలో పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు తంగుడు జోగారావు, వైస్ ప్రెసిడెంట్ ముద్దాడ సూర్యనారాయణ, పీఆర్‌ఓ లాడి రమేష్, జాయింట్ సెక్రటరీ తంగుడు నాగేశ్వరరావు, కోరాడ శంకర్‌కుమార్, రుగడ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

1.30 లక్షల టన్నుల సీఎంఆర్ రైస్ సేకరణకు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత ఆహార సంస్థ ద్వారా ఈ ఏడాది 1,30,000 టన్నుల ఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఎఫ్‌సీఐ మేనేజర్ వై.సునీల్‌కుమార్ మంగళవారం తెలిపారు. గతంలో మాదిరిగా సాధారణ రైస్ కాకుండా పూర్తిగా పోర్టుఫైడ్ రైస్‌ను మాత్రమే సేకరిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు కృషి చేస్తున్నామని, సీఎంఆర్ రైస్ కొనుగోలుకు సంబంధించి ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. సివిల్ సప్లయ్ అధికారులు లక్ష్యాల మేర బియ్యం దజేయాల్సి ఉంటుందని తెలిపారు. గత ఏడాది 40 వేల టన్నులు లక్ష్యంగా కాగా ఆ స్థాయిలో సీఎంఆర్‌ను అందించలేదని, కేవలం 5వేల మెట్రిక్ టన్నులకే పరిమితమయ్యారని వివరించారు. ఇప్పటి వరకు 700 మెట్రిక్ టన్నులు బియ్యం అందించినట్లు ప్రకటించారు. అదనపు గోదాములు కోసం జేసీకి లేఖ రాశామన్నారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ సివిల్ సప్లై హమాలీలకు కూలి రేట్లు పెంచాలని సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద ఏపీ సివిల్ సప్లయ్ హమాలీలు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గడువు ముగిసి మూడు నెలలైనా ఇప్పటి వరకు కూలీ రేటు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి రేట్లు పెంచడంతో పాటు పీఎఫ్, బోనస్ అందజేయాలని కోరారు.

తోటి మహిళలకు చేదోడువాదోడుగా ఉందాం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : మంచి పనులు చేయడానికి భయపడకూడదని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా తోటి మహిళలకు చేదోడువాదోడుగా ఉందామని జిల్లాలోని మహిళా పోలీసులకు ఎస్పీ జీఆర్ రాధిక దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహిళా పోలీసుల విధి విధానాలు, ప్రజా రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందించారు. గ్రామాల్లోని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. దిశ యాప్, మహిళలపై జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు, సైబర్ నేరాల వంటి వాటిపై గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన కల్పించాలన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటేనే వారికి నమ్మకం కలుగుతుందని చెప్పారు. వీసీలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు, వారి వారి కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల నుంచి పాల్గొన్నారు.

● అంబరాన్నంటిన సంబరం



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులతో పాటు విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. ముగ్గులు, భోగి మంటలు, హరిదాసుల వేషధారణలు అలరించాయి.

- నరసన్నపేట